






ప్రజా

# రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 221 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 +https:www.prajarepublic.com + వెల - 1/- | సోమవారం 17 మార్చి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదు: ప్రధాని మోదీ

ఉగ్రవాదం, వేర్పాటువాదం కట్టడికి సంబంధించిన విషయాల్లో న్యూజిలాండ్తో కలిసి పని చేస్తామని ప్రధాని మోదీ అన్నారు.

(రిపబ్లిక్ న్యూస్), మార్చి 17: ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ప్రధాని నరేంద్రమోదీ తేల్చిచెప్పారు. 2019లో క్రైస్ట్చర్చ్ నగరంపై జరిగిన దాడి అయినా.. 2008లో ముంబయిపై దాడి అయినా తమవైఖరి ఒకటే అని స్పష్టంచేశారు. ఉగ్రవాదులు, వేర్పాటువాదులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సహకారాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. మనదేశంలో పర్యటిస్తోన్న న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్తో భేటీ అనంతరం మోదీ ఈ విధంగా స్పందించారు.



న్యూజిలాండ్లో కొన్ని శక్తులు భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న విషయాన్ని ఆ దేశ ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఇక భేటీలో భాగంగా వాణిజ్యం, రక్షణ, విద్య, వ్యవసాయం వంటి రంగాలపై వారి మధ్య చర్చలు జరిగాయి. రక్షణ రంగంలో రెండు దేశాల మధ్య సహకారాన్ని కొనసాగించే దిశగా ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. అలాగే పరస్పర ప్రయోజనకరమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు ప్రారంభించాలని నిర్ణయించుకున్నాయి. ఈ అగ్రిమెంట్ తో ఇరుదేశాలకు ఉపయోగపడే రీతిలో వాణిజ్య సామర్థ్యం పెరుగుతుందని, పాడిపరిశ్రమ, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా వంటి రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశాయి. తాము అభివృద్ధివాదాన్ని కోరుకుంటున్నామని, విస్తరణవాదాన్ని కాదని ఇరు దేశాలు వెల్లడించాయి. 2019లో క్రైస్ట్ చర్చ్ నగరంలోని మసీదుపై జరిగిన ఉగ్రదాడి ఘటనలో 51 మంది ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. దీనినే మోదీ ప్రస్తావించారు.

## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం.. తితిదే అనుమతి

తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) వెల్లడించింది.

తిరుమల, మార్చి 17, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ ప్రజాప్రతినిధులు సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) వెల్లడించింది. ఈ మేరకు తితిదే ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో పేర్కొంది.



తెలంగాణ నేతల సిఫార్సు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఆది, సోమవారం (సోమ, మంగళవారం దర్శనాలకు) మాత్రమే లేఖలు స్వీకరిస్తామని తెలిపింది. బుధవారం, గురువారం రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలకు (ఏ రోజుకు ఆ రోజే) లేఖలు అనుమతిస్తామని స్పష్టం చేసింది. నిర్దేశిత రోజుల్లో ప్రజాప్రతినిధులకు సంబంధించి ఒక లేఖ మాత్రమే (ఆరుగురు భక్తులకు మించకుండా) స్వీకరిస్తామని వెల్లడించింది. ఈ విధానం మార్చి 24 నుంచి అమలు చేయనున్నట్లు తితిదే వెల్లడించింది. ఇప్పటివరకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనానికి గాను ఆదివారం ఏపీ ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు స్వీకరిస్తున్నారు. ఇకపై శనివారం (ఆదివారం దర్శనం కోసం) స్వీకరించనున్నట్లు తితిదే పేర్కొంది. తిరుమలలో అందుబాటులో ఉన్న వసతి సౌకర్యాలు, ఇతర భక్తుల దర్శన సమయాలను దృష్టిలో పెట్టుకొని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మార్పులను భక్తులు దృష్టిలో ఉంచుకొని తిరుమల తిరుపతి దేవస్థానానికి సహకరించాలని కోరింది.

## బీసీ రిజర్వేషన్ల బిల్లుకు భారాస సంపూర్ణ మద్దతు ఉంటుంది:హరీశ్ రావు

బీసీ రిజర్వేషన్ల బిల్లుకు భారాస సంపూర్ణ మద్దతు ఇస్తుందని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు.



హైదరాబాద్, మార్చి 17, (రిపబ్లిక్ న్యూస్): బీసీ రిజర్వేషన్ల బిల్లుకు భారాస సంపూర్ణ మద్దతు ఇస్తుందని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్రావు తెలిపారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఫలాలు అందినప్పుడే బీసీలు సంతోషిస్తారని అన్నారు. ఈ అంశంపై శాసనసభలో ఏకగ్రీవ తీర్మానానికి, పార్లమెంట్లో పోరాటానికి భారాస కలిసి వస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతూ ఓటేస్తామని చెప్పారు. బిల్లుపై రాహుల్ గాంధీ పార్లమెంట్లో ఒత్తిడి తీసుకురావాలని హరీశ్రావు కోరారు.

## ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ ట్రాక్లో పెట్టాం : ఏపీ సీఎం చంద్రబాబు

వికసిత్ భారత్-2047 కల్లా దేశం 30 ట్రిలియన్ల డాలర్ల జీడీపీకి చేరాలని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.

అమరావతి, మార్చి 17, (రిపబ్లిక్ న్యూస్): 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల జీడీపీకి చేరాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. శాసనసభలో స్వర్ణాంధ్ర విజన్ -2047 డాక్యుమెంట్పై లఘు చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. "నియోజకవర్గ విజన్ డాక్యుమెంట్ అమలుపరిచే బాధ్యత ఎమ్మెల్యేలదే. దాని అమలుకు ఎమ్మెల్యేలకు పూర్తిగా సహకరిస్తాం. 2047 కల్లా రాష్ట్ర తలసరి ఆదాయం రూ.55 లక్షలు సాధించేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించాం. అప్పటికల్లా 2.4 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థకు ఏపీ చేరాలి.



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17.11 శాతం మేర వృద్ధిరేటు సాధించేలా లక్ష్యం పెట్టుకున్నాం. వికసిత్ భారత్-2047ను ప్రధాని మోదీ అమలు చేస్తున్నారు. ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ ట్రాక్ లో పెట్టగలిగాం. దూరదృష్టితో ఆలోచించి ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్కు విజన్ 2020 తీసుకొచ్చాం. చెప్పిన దానికంటే ఎక్కువ ప్రయోజనమే ఉమ్మడి రాష్ట్రానికి కలిగింది. పేదరిక నిర్మూలన వంటి పది సూత్రాలను లక్ష్యంగా పెట్టుకున్నాం. రంగాల వారీగా ఎప్పటికప్పుడు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. జిల్లాల వారీగా ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేస్తాం. మారిన ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు చేస్తున్నాం. రాళ్లసీమ ఎడారిగా మారిపోతుందని అనుకున్నారు. రాయలసీమను రతనాలసీమగా మార్చడం ఖాయం" అని చంద్రబాబు అన్నారు.

## చర్లపల్లి రైల్వే టెర్మినల్కు పొట్టి శ్రీరాములు పేరు పెడదాం: సీఎం రేవంత్ ప్రతిపాదన

తెలుగు రాష్ట్రాల్లో ఒకే పేరుపై యూనివర్సిటీలు, సంస్థలు ఉంటే పరిపాలనా పరమైన సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్, మార్చి 17, (రిపబ్లిక్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో ఒకే పేరుపై యూనివర్సిటీలు, సంస్థలు ఉంటే పరిపాలనా పరమైన సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందని తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి అన్నారు. దాన్ని పరిష్కరించేందుకే రాష్ట్రంలోని యూనివర్సిటీలు, సంస్థలకు తెలంగాణకు సంబంధించిన పేర్లు పెడుతున్నామని చెప్పారు. శాసనసభలో ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్, తెలుగు వర్సిటీ పేరు మార్పు తదితర బిల్లులు ప్రవేశపెట్టిన నేపథ్యంలో సీఎం మాట్లాడారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. "తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అనేక యూనివర్సిటీలకు పేర్లు మార్చుకున్నాం.



పరిపాలనా సౌలభ్యం కోసమే కొన్ని వర్సిటీలకు ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, పీవీ నరసింహారావు, కాళోజీ నారాయణరావు పేర్లు పెట్టుకున్నాం. అదే ఒరవడిలో పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్రెడ్డి పేరు పెడుతున్నాం. తెలంగాణ సమాజానికి ఆయన ఎంతో సేవ చేశారు. గోల్కొండ పత్రికను సురవరం నడిపారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడారు. పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్చడం ఎవరికీ వ్యతిరేకం కాదు. దివంగత మాజీ సీఎం రోశయ్య, ఆర్యవైశ్య సమాజం పట్ల ప్రభుత్వానికి అపారమైన గౌరవం, నమ్మకం, విశ్వాసం ఉంది. కులం, మతం పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకోవడం సరికాదు. చర్లపల్లి రైల్వే టెర్మినల్కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కేంద్రమంత్రులు కిషన్రెడ్డి, బండి సంజయ్కు లేఖ రాస్తా. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలను గుర్తుచేసుకుందాం. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకురావాలని కిషన్ రెడ్డి, బండి సంజయ్ను కోరుతున్నా.

### నేచర్ క్యూర్ ఆస్పత్రికి రోశయ్య పేరు

బల్కంపేట్లో నేచర్ క్యూర్ ఆస్పత్రికి రోశయ్య పేరు పెడతాం. ఆయన సుదీర్ఘ అనుభవం గల నేత. గవర్నర్, సీఎంగా ఎన్నో సేవలందించారు. నేచర్ క్యూర్ ఆస్పత్రి సమీపంలో రోశయ్య విగ్రహం నెలకొల్పి అధికారికంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తాం" అని సీఎం ప్రకటించారు.

## పోలవరం ఎత్తును తగ్గించింది జగన్ ప్రభుత్వమే:మంత్రి నిమ్మల

పోలవరం కోసం 2014 నుంచి ఇప్పటివరకు రూ.19,396 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

అమరావతి, మార్చి 17, (రిపబ్లిక్ న్యూస్): పోలవరం కోసం 2014 నుంచి ఇప్పటివరకు రూ.19,396 కోట్లు ఖర్చు చేసినట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. "పోలవరం కోసం కేంద్రం రూ.17,860 కోట్లు చెల్లించింది. ప్రాజెక్టు వల్ల 96,660 కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయి.



నిర్వాసితులకు తొలి దశలో రూ.1,203 కోట్లు అందించాం. ఇంకా 18,266 కుటుంబాలకు రూ.1340 కోట్లు చెల్లించాలి. ఇప్పటివరకు 12,797 నిర్వాసితుల కుటుంబాలను తరలించాం. ఇంకా 27,263 కుటుంబాలను తరలించాలి. 75 నిర్వాసితుల కాలనీల్లో 49 నిర్మాణంలో ఉన్నాయి. ఆగస్టు లోపు భూసేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తొలి దశ ఆర్అండ్ఆర్ను 2026 జూన్ లోపు పూర్తి చేస్తాం. పోలవరం ఎత్తును జగన్ హయాంలోనే రెండుగా విభజించారు. పోలవరానికి 41.15 మీటర్ల ఎత్తు ప్రతిపాదన పెట్టింది వైకాపా ప్రభుత్వమే. పోలవరం ఎత్తు ఎందుకు తగ్గించారో జగన్నే అడగాలి. నిర్వాసితుల కాలనీల్లో ఒక్క ఇంటికీ ఆయన హయాంలో పునాది వేయలేదు" అని నిమ్మల రామానాయుడు అన్నారు.

## ఆదాయం తగ్గిందని సీఎం అంగీకరించారు.. ఇంతకంటే అవమానం ఉండదు: కేటీఆర్

రాష్ట్ర ప్రభుత్వానికి రూ.70 వేల కోట్ల మేర ఆదాయం తగ్గిందని సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.



హైదరాబాద్, మార్చి 17, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రప్రభుత్వానికి రూ.70 వేల కోట్ల మేర ఆదాయం తగ్గిందని సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఇంతకంటే రాష్ట్రానికి ఘోర అవమానం ఇంకొకటి ఉండదని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్.. బడ్జెట్ కంటే ముందే నేరాన్ని అంగీకరించి అప్రూవర్గా మారారని అన్నారు. దీని ద్వారా రాష్ట్రప్రభుత్వం పూర్తి అట్టర్ఫ్లాప్ అని అంగీకరించినట్లేనన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కావడానికి సీఎం అవలంబిస్తోన్న విధానాలే కారణమని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్పై ద్వేషంతో కాళేశ్వరం ప్రాజెక్టును బంద్ పెట్టి సాగును నాశనం చేశారని మండిపడ్డారు.

"మాకు చాలా విషయాలు తెలుసు. మేము వాస్తవాలు బయటపెడితే సీఎంకు ఇబ్బందులు తప్పవు. భాజపా నేతలతో రహస్య భేటీలను రేవంత్ ఎందుకు ఖండించట్లేదు? ఆ రహస్య భేటీలపై భాజపా నేతలు కూడా మాట్లాడటం లేదు. రహస్య భేటీలను అంగీకరించలేకపోతే ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్పై చర్యలు తీసుకోవాలి. ఫార్ములా ఈ-రేస్ వద్దన్న సీఎం.. నగరంలో అందాల పోటీల నిర్వహణతో ఏం సాధిస్తారు? అందాల పోటీలకు రూ.2వేలు కోట్లు ఖర్చు చేసే బదులు.. మహిళలకు రూ.2500 చొప్పున ఇవ్వండి. ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో నా తప్పు లేదు. అధికారంలోకి వచ్చాక మళ్లీ కేసును విచారణ చేయిస్తాం" అని కేటీఆర్ అన్నారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# చరిత్రలో నేటి ప్రత్యేకత

- 763: ప్రఖ్యాతిగాంచిన అబ్బాసీయ ఖలీఫా హారూన్ రషీద్ జననం. (మ.809)
- 1892: తెలుగు కవి రాయప్రోలు సుబ్బారావు జననం. (మ.1984)
- 1896: పాలమూరు జిల్లాకు చెందిన సమరయోధుడు మందుముల నరసింగరావు జననం. (మ.1976)
- 1962: ఇండియన్–అమెరికన్ వ్యోమగామి, వ్యోమనౌక యంత్ర నిపుణురాలు కల్పనా చావ్లా జననం. (చిత్రంలో)
- 1963: వెస్టిండీస్‌కు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు రోజర్ హార్పర్ జననం.

1982: కేరళలో రాష్ట్రపతి పాలన.

- 1990: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ సాధించిన తొలి మహిళ సైనా నెహ్వాల్ జననం.


అబ్బాసీయ ఖలీఫా హారూన్ రషీద్


రాయప్రోలు సుబ్బారావు


మందుముల నరసింగరావు


కల్పనా చావ్లా


రోజర్ హార్పర్


కేరళ


సైనా నెహ్వాల్

రిపబ్లిక్ స్పోర్ట్స్

# థాంక్యూ ధోనీ.. అప్పుడు రాలేదు.. ఇప్పుడు బెస్ట్ 'గిఫ్ట్' ఇచ్చావు: అశ్విన్

**భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీకి రవిచంద్రన్ అశ్విన్ ధన్యవాదాలు చెప్పాడు. అది ఎందుకో తెలుసుకోవాలంటే ఇది చదివేద్దాం.**



చాన్నాళ్ల తర్వాత మళ్లీ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు రవిచంద్రన్ అశ్విన్ సిద్ధమైపోయాడు. అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికిన తర్వాత అశ్విన్ తొలిసారి ఐపీఎల్ ఆడబోతున్నాడు. ఈ క్రమంలో టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ గురించి అశ్విన్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకొన్నాడు. తనకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో విఫలమైనప్పటికీ.. ఇలాంటి గిఫ్ట్ ఇస్తాడని ఊహించలేదని వ్యాఖ్యానించాడు. వందో టెస్టు సందర్భంగా బీసీసీఐ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేసి అశ్విన్కు జ్ఞాపికను అందజేసింది. అయితే, ఆ మెమొంటోను ధోనీ చేతులమీదుగా తీసుకోవాలని అశ్విన్ భావించాడట. కానీ, అలా జరగలేదు. ఇదే విషయాన్ని అశ్విన్ తాజాగా వెల్లడించాడు. "ధర్మశాల వేదికగా మ్యాచ్ జరిగింది. అది నా వందో టెస్టు. ధోనీ చేతులమీదుగా మెమొంటో తీసుకోవాలని భావించా. అదే నా చివరి మ్యాచ్ అవుతుందని అనుకున్నా. అయితే, ఆ టెస్టుకు ధోనీ రాలేదు. ఇప్పుడు మాత్రం నన్ను సీఎస్కేకు మళ్లీ తీసుకొని ఇలాంటి మంచి బహుమతి ఇస్తాడని అనుకోలేదు. ఎంఎస్ ధోనీకి ధన్యవాదాలు. నీవల్లే ఇక్కడున్నా. మరీ ముఖ్యంగా ఒక విషయం చెప్పాలి. ఇప్పటివరకు నేను చాలా క్రికెట్ ఆడా. ఎంతో సాధించా.. కానీ అదంతా పక్కన పెట్టేసి ఇప్పుడు ఆటను ఆస్వాదించాలని భావిస్తున్నా" అని అశ్విన్ వెల్లడించాడు.

## తుది జట్టులో పోటీ తీవ్రం

తుది జట్టులో స్థానం కోసం చెన్నైలో తీవ్రమైన పోటీ ఉంది. స్పిన్ విభాగంలో ఇప్పటికే రవీంద్ర జడేజా ముందు వరుసలో ఉన్నాడు. అతడితోపాటు ఇప్పుడు అశ్విన్ కూడా జత కలిస్తే సీఎస్కేకు తిరుగుండదు. అదే సమయంలో అఫ్గాన్ యువ స్పిన్నర్ నూర్ అహ్మద్కు అవకాశం ఇస్తారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారనుంది. ఇక రచిన్ రవీంద్ర వంటి ఓపెనర్ కమ్ స్పిన్నర్ కూడా ఆ జట్టులో ఉన్నాడు. కానీ, అతడిని ఇన్నింగ్స్ను ప్రారంభించేందుకు పంపించే అవకాశాలు తక్కువే.. దేవన్ కాన్వే వంటి భారీ హిట్టర్ ఉండటంతో రచిన్ను మిడిలార్డర్కే పరిమితం చేసే ఛాన్స్ ఉంది.

# ఓటీటీలోకి 'స్కైఫోర్స్'.. అందుబాటులోకి ఫ్రీ స్ట్రీమింగ్!

**అక్షయ్ కుమార్ నటించిన తాజా చిత్రం 'స్కైఫోర్స్'. ఈ చిత్రం ఫ్రీ స్ట్రీమింగ్ తేదీని అమెజాన్ ప్రకటించింది.**




అక్షయ్ కుమార్, వీర్ పహారియా, సారా అలీఖాన్, నిమ్రత్ కౌర్ కీలక పాత్రల్లో నటించిన వార్ డ్రామా 'స్కైఫోర్స్'. జనవరి 24న వచ్చిన ఈ మూవీ మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. ఇటీవల ఈ సినిమా సైలెంట్గా అమెజాన్ ప్రైమ్ వేదికగా అందుబాటులోకి వచ్చింది. అయితే గత కొన్ని రోజులుగా అద్దె ప్రాతిపదికన అందుబాటులో ఉన్న చిత్రం ఇప్పుడు ఫ్రీగా స్ట్రీమింగ్కు రానుంది. మార్చి 21 నుంచి ఈ సినిమాను ఉచితంగా చూసే అవకాశం కల్పించింది అమెజాన్. కథేంటంటే 1965లో జరిగిన భారత్– పాకిస్థాన్ వైమానిక యుద్ధం నేపథ్యంలో సాగే చిత్రమిది. ఆ యుద్ధంలో కనిపించకుండా పోయిన భారత వైమానిక దళం స్క్వాడ్రన్ లీడర్ అజ్జమడ బొప్పయ్య దేవయ్య సాహస పోరాటం ఈ కథకి స్ఫూర్తి. పాకిస్థాన్ వైమానిక స్థావరానికి గుండెకాయ లాంటి సర్గోదపై భారత్ ప్రతీకార దాడికి దిగినప్పుడు ఏం జరిగింది? ఆ దాడి చేయడానికి దారితీసిన పరిస్థితులేమిటి? అందులో పాల్గొన్న భారత వైమానిక సైనికుడు కనిపించకుండా పోవడానికి కారణమేమిటి? అతని త్యాగం దేశానికి ఎలా తెలిసిందన్నది ఈ సినిమాలో కీలకం. బొప్పయ్య దేవయ్యని పోలిన ఫైటర్ పైలట్ టి. కృష్ణ విజయ అలియాస్ టాబీ పాత్రలో వీర్ పహారియా నటించగా, ఆయన గురువైన వింగ్ కమాండర్ అహూజా పాత్రలో అక్షయ్కుమార్ నటించారు. అక్షయ్ పాత్రకి భారత వైమానిక దళ అధికారి, గ్రూప్ కెప్టెన్ ఓం ప్రకాశ్ తనేజా స్ఫూర్తి.

# నా అభిప్రాయం ఆ హీరోకి నచ్చకపోయి ఉండొచ్చు:శివాజీ

**మంగపతి పాత్రలో నటించడంపై ఆనందం వ్యక్తంచేశారు నటుడు శివాజీ. ఇలాంటి పాత్రల కోసమే తాను ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నానని తెలిపారు.**




మంగపతి పాత్రలో నటించడంపై ఆనందం వ్యక్తంచేశారు నటుడు శివాజీ. ఇలాంటి పాత్రల కోసమే తాను ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నానని తెలిపారు. కేవలం డబ్బు కోసమే తాను సినిమాలు చేయడం లేదని.. నటుడిగా సంతృప్తినిచ్చే పాత్రల కోసమే తాను ఎన్నోఏళ్లుగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. 'కోర్ట్'తో తన కొత్త జీవితం మొదలైందని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. "90స్ వెబ్ సిరీస్ తర్వాత నాకు ఎన్నో అవకాశాలు వచ్చాయి. చాలావరకూ తండ్రి పాత్రలే. దాంతో వాటిని రిజెక్ట్ చేశా. కెరీర్ పరంగా ఎన్నో విభిన్నమైన పాత్రలు పోషించాలని ఉంది. ఈ క్రమంలోనే 'కోర్ట్'లో అవకాశం వచ్చింది. ఇలాంటి పాత్రల కోసమే దాదాపు 25 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నా. ఈ సినిమా చూసిన తర్వాతైనా దర్శకులు నా వద్దకు విభిన్నమైన పాత్రలతో వస్తారని ఆశిస్తున్నా. 'విక్రమ్'లో ఏజెంట్ టీనా, 'సరిపోదా శనివారం'లో ప్రతి నాయకుడి పాత్రలు చూసినప్పుడు నటుడిగా నాకెంతో సంతృప్తిగా అనిపించింది. ఇలాంటి పాత్రలు నాకు ఎప్పుడు వస్తాయి? అనుకున్నా. డబ్బే ముఖ్యం అనుకుంటే రోజుకు నాలుగు సినిమాలు చేయొచ్చు. కానీ, నేను మాత్రం సరైన పాత్రల కోసం ఎదురుచూశా. మార్చి 14న నా కొత్త జీవితం మొదలైంది. ఇటీవల నావద్దకు ఒక స్క్రిప్ట్ వచ్చింది. కథ చాలా విభిన్నంగా అనిపించింది. దర్శకుడు కథ చెప్పగానే.. నా పాత్రకు సంబంధించి రెండు కీలకమైన విషయాలు చెప్పా. వాటివల్ల సినిమాపై ప్రభావం ఉంటుందని కూడా తెలియజేశా. అయితే అది హీరోకు నచ్చకపోయి ఉండొచ్చు. అందుకే వాళ్లు మళ్లీ నన్ను సంప్రదించలేదు. ఆ సినిమా ఇంకా మొదలైనట్లు లేదు" అని శివాజీ తెలిపారు. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన చిత్రం 'కోర్ట్. హీరో నాని నిర్మాతగా, రామ్ జగదీశ్ దర్శకుడిగా వ్యవహరించారు. పోక్సో చట్టం గురించి తెలియజేస్తూ రూపొందిన ఈ కోర్టు రూమ్ డ్రామాలో హీరోయిన్ తరపు బంధువు మంగపతి పాత్రలో శివాజీ నటించి ప్రేక్షకుల మన్ననలు అందుకుంటున్నారు. నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో శివాజీ యాక్టింగ్తో మెప్పించారంటూ సినీ ప్రముఖులు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# సల్మాన్ ఖాన్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు:రష్మిక

**సల్మాన్ ఖాన్ హీరోగా రష్మిక కథానాయికగా రానున్న చిత్రం సికందర్. ఈ సినిమాలోని పాట బీటీఎస్ వీడియోను చిత్రబృందం షేర్ చేసింది.**



బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ హీరోగా రానున్న చిత్రం 'సికందర్'. ఇందులో సల్మాన్ సరసన రష్మిక కనిపించనున్నారు. ఇటీవల హోలీ సందర్భంగా ఈ సినిమా నుంచి 'భం భం భోలే శంభు.. అనే పాటను విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ పాట బీటీఎస్ ను చిత్రబృందం పంచుకుంది. ఆ బీటీఎస్ వీడియో షేర్ చేసిన రష్మిక ఈ హీరో గురించి మాట్లాడారు. 'సల్మాన్ ఖాన్ నుంచి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. సెట్లో ఎంతో ఎనర్జీతో ఉంటారు' అని కామెంట్ చేశారు. ఈ కామెంట్ అభిమానుల్లో ఉత్సాహం పెంచింది. ఇక గతంలోనూ సల్మాన్ గురించి రష్మిక మాట్లాడారు. ఆయనతో నటించడం తన కల అని పేర్కొన్నారు. పెద్ద స్టార్ హీరో అయినా.. ఒదిగి ఉంటారన్నారు. షూటింగ్లో తనకు ఆరోగ్యం బాగా లేకపోతే సల్మాన్ ఇంటి నుంచి భోజనం తెప్పించేవారని తెలిపారు. యాక్షన్ థ్రిల్లర్ 'సికందర్ ముస్తాబవుతోంది. ఇటీవల దీని షూటింగ్ పూర్తయింది. రంజాన్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల విడుదల చేసిన పాటలో సల్మాన్, రష్మిక స్టెప్పులు అలరించాయి. మధ్యలో కథానాయిక కాజల్ అగర్వాల్ తళుక్కున మెరిశారు. ప్రస్తుతం ఈ పాట మిలియన్ల వ్యూస్తో సోషల్ మీడియాలో ట్రెండింగ్లో ఉంది.

# ఆరోగ్యం

## ఉదయం పూట శరీరంలో కనిపించే కొన్ని లక్షణాలు కిడ్నీ ఇన్ఫెక్షన్‌కు సంకేతం, ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయకండి


**మూత్రపిండాల ఇన్ఫెక్షన్‌కు అనేక కారణాలు ఉండవచ్చు. అందులో ప్రధానమైంది యూటీఐ. ఈ. కోలి అనే బ్యాక్టీరియా మూత్రనాళం ద్వారా మూత్రాశయంలోకి ప్రవేశించి.. అక్కడి నుంచి కిడ్నీలకు ప్రయాణించినప్పుడు ఇన్ఫెక్షన్ రావచ్చు.**

కిడ్నీ ఇన్ఫెక్షన్‌ను వైద్యపరంగా పైలోనెఫ్రిటిస్ అని పిలుస్తారు. ఇది మూత్రపిండాలను చేరే బ్యాక్టీరియా వల్ల కలిగే తీవ్రమైన ఇన్ఫెక్షన్. ఇది మూత్ర వ్యవస్థ యొక్క దిగువ భాగంలో (మూత్రాశయం లేదా మూత్రనాళం) ప్రారంభమై మూత్రపిండాలకు వ్యాపించవచ్చు. ఈ ఇన్ఫెక్షన్‌కు సకాలంలో చికిత్స చేయకపోతే, అది కిడ్నీలను దెబ్బతీస్తుంది. అంతేకాకుండా ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం కూడా ఉంది. మూత్రపిండాల ఇన్ఫెక్షన్‌కు అనేక కారణాలు ఉండవచ్చు. అందులో ప్రధానమైంది యూటీఐ. ఈ. కోలి అనే బ్యాక్టీరియా మూత్రనాళం ద్వారా మూత్రాశయంలోకి ప్రవేశించి.. అక్కడి నుంచి కిడ్నీలకు ప్రయాణించినప్పుడు ఇన్ఫెక్షన్ రావచ్చు. మధుమేహం లేదా ఎయిడ్స్ వంటి రోగాలతో బాధపడేవారికి బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ ఉంటుంది. వీరు మూత్రపిండాల ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే వారి శరీరాలు ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. కిడ్నీ ఇన్ఫెక్షన్ అనేది ఒక తీవ్రమైన పరిస్థితి కావచ్చు, అందుకే ముందుగానే లక్షణాల్ని గుర్తించాలి. కిడ్నీలు ఇన్ఫెక్షన్‌కు గురైతే ఉదయం పూట కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.






### వెన్ను లేదా నడుము నొప్పి




కిడ్నీ ఇన్ఫెక్షన్ ఉంటే నిద్ర లేచిన వెంటనే, నడుము దిగువ భాగంలో లేదా వెన్నులో తీవ్రమైన నొప్పి అనిపించవచ్చు. ఈ నొప్పి ఒక వైపు లేదా రెండు వైపులా ఉండొచ్చు. దీని కారణంగా మీరు రోజువారీ పనులు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. అంతేకాకుండా ఈ లక్షణాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టంగా ఉంటుంది.

### జ్వరం, చలి



కిడ్నీ ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు, శరీరంలో జ్వరం, చలి సాధారణ లక్షణాలు. జ్వరంతో పాటు బలహీనత, అలసట అనిపించవచ్చు. ఉదయం లేవగానే జ్వరంతో పాటు అలసట, నీరసం ఉంటే జాగ్రత్త. పదే పదే ఇలా జరుగుతుంటే వెంటనే వైద్యుణ్ని సంప్రదించడం ముఖ్యం. ఈ లక్షణాన్ని చాలా మంది విస్మరిస్తారు. అయితే, దీనిని నెగ్లెట్ చేస్తే భవిష్యత్తులో కిడ్నీ పాడయ్యే ప్రమాదం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### మూత్ర సమస్యలు



మూత్ర సమస్యలు కిడ్నీల సమస్యలను సూచిస్తాయి. మీరు ఈ సంకేతాలను గుర్తించడం చాలా ముఖ్యం. తరచుగా మూత్ర విసర్జన చేయడం, మూత్ర విసర్జన సమయంలో మంట లేదా నొప్పి, ముదురు రంగు మూత్రం, మూత్రం నుంచి దుర్వాసన రావడం కిడ్నీ ఇన్ఫెక్షన్ సంకేతాలు కావచ్చు.

### వాంతులు లేదా వికారం



మూత్రపిండాల ఇన్ఫెక్షన్ విషయంలో అజీర్ణం, వాంతులు లేదా వికారం వంటి సమస్యలు ఉండవచ్చు. ఇన్ఫెక్షన్ కారణంగా జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపడం వల్ల ఇది జరుగుతుంది. ఇది చాలా సాధారణ లక్షణం. ఉదయం నిద్రలేచిన వెంటనే వికారంతో వాంతులు అయితే జాగ్రత్త ఉండటం మంచిది. ఈ లక్షణం చాలా కాలం పాటు ఉంటే వెంటనే వైద్యుణ్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలంటున్నారు నిపుణులు.

### శరీరంలో వాపు



కాళ్ళు, చీలమండలు, ముఖంలో వాపు వంటి లక్షణాలు పదే పదే కనిపిస్తే మూత్రపిండాలు ఇన్ఫెక్షన్‌కు గురయ్యాని అర్థం. మూత్రపిండాలు సరిగా పనిచేయడంలో విఫలమై శరీరంలో ద్రవం పేరుకుపోవడం ప్రారంభించినప్పుడు ఇది జరుగుతుంది. ఈ లక్షణాలు మీకు పదే పదే కనిపిస్తే సకాలంలో చికిత్స ప్రారంభించడానికి, ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

### కిడ్నీ ఇన్ఫెక్షన్‌ని ఎలా నివారించాలి

- మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి, ముందుగా ఆహారపు అలవాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టండి.
- నొప్పి నుంచి ఉపశమనం పొందడానికి, వైద్యుడిని అడగకుండా నొప్పి నివారణ మందులు లేదా మరే ఇతర రకాల మందులను వాడకండి
- రోజుకు 3–4 లీటర్ల నీరు తాగడం అలవాటు చేసుకోండి. ఇది మూత్రపిండాలను ఫిల్టర్ చేస్తుంది.
- రాత్రి ఏడు నుంచి 8 గంటలు నిద్రపోండి. పగటి పూట తగినంత విశ్రాంతి తీసుకోండి.
- మూత్రాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆపుకోకండి. లి పరిశుభ్రంగా ఉండటం అలవాటు చేసుకోండి.

**గమనిక:** ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.